క్లుప్తంగా

బతుకమ్మకు సెంటర్లను సిద్ధం చేయండి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): బతుకమ్మ ఆట పాటకు సెంటర్లను అన్ని సౌకర్యాలతో సిద్ధం చేయాలని మంగళవారం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధికారులను ఆదేశించారు. బస్తీలు, గ్రామాలు, ప్రధాన సెంటర్లలో మున్సిపల్, గ్రామపంచాయతీలు సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు.

విద్యార్థినుల ప్రతిభ

టేకులపల్లి: జిల్లా కేంద్రంలో సోమవారం రోల్ ప్లే పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికలు ఎం.తేజశ్విని, నిహారిక, బి.నందినీ ద్వితీయ బహుమతి సాధించారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోల్ ప్లే విజేతలను, గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయులు ఎం.రవీందర్, సీహెచ్ పద్మావతిలను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉద్యోగులుగా గుర్తించాలి

పాల్వంచ: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేసి ఉద్యోగులుగా గుర్తించాలని టీవీ జేఏసీ రాష్ట్ర కోచైర్మన్ బానోతు శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం కేటీపీఎస్ 5వ దశలో టీ టైంలో కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. త్వరలో వరంగల్ టీజీ ఎన్‌పీడీసీఎల్‌లో ఈ డిమాండ్లపై సీఎండీకి వినతిపత్రం అందిస్తామన్నారు. రానున్న రోజుల్లో నిర్వహించే ఆందోళన కార్యక్రమాల్లో ఆర్టిజన్లు ఐకమత్యంగా ఉండి విజయవంతం చేయాలని కోరారు.

ఉత్సవాలకు ప్రచారమేది?

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో ఏటా దసరా సందర్భంగా నిర్వహించే శ్రీదేవి శరన్నవరాత్ర మహోత్సవాలకు ఈసారి పెద్దగా ప్రచారం చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. 3 నుంచి 12వ తేదీ వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు జరగనున్నాయి. గతంలో కనీసం పది రోజుల ముందు నుంచే ప్రచారం చేయగా, ఈసారి కనీసం వీఐపీలకు సైతం ఆహ్వాన పత్రికలను అందించలేదు. ఆలయానికి పాలకవర్గం లేకపోవడం, ఈఓకు పెద్దమ్మగుడితోపాటు ఇతర ఆలయాల బాధ్యతలు ఉండడంతో ఈ పరిస్థితి నెలకొందని సమాచారం. ఈ విషయమై ఈఓ రజనీకుమారిని వివరణ కోరగా.. వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నామని తెలిపారు.

అక్రమ పట్టాలను రద్దు చేయాలి

టేకులపల్లి: 303 సర్వే నంబరులో ఉన్న భూములను ఎంజాయ్‌మెంట్ సర్వే చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సంపత్‌నగర్, మిట్టపల్లి గ్రామాల శాఖ మహాసభలు జోగ లక్ష్మయ్య అధ్యక్షతన ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 303 సర్వే నంబర్ భూముల్లో ఏళ్ల తరబడి సాగు చేస్తున్న స్థానిక గిరిజనులకు పట్టాలు ఇవ్వకుండా, భూమి లేకున్నా కొందరికి అక్రమ పట్టాలు ఇచ్చారని విమర్శించారు. అక్రమ పట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్య పరిష్కారానికి ఎంజాయ్ మెంట్ సర్వే చేయాలని కోరారు. అక్రమ పట్టాలు పొందిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

టేకులపల్లి: జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం జీఓ నంబర్ 317 బాధితుల చలో గాంధీభవన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాంకుడోత్ హత్తీరామ్‌నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చలో గాంధీ భవన్ పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ... రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు శాంతి ర్యాలీలో పాల్గొనాలని కోరారు.

ఎంఈఓకు సన్మానం

జూలూరుపాడు: మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ)గా విధులు నిర్వర్తిస్తున్న గుగులోత్ వెంకట్ ఇటీవల ఖమ్మం జిల్లా కామేపల్లి మండలానికి బదిలీ అయ్యారు. 2015 జూలై నుంచి జూలూరుపాడు ఎంఈఓగా పని చేశారు. మంగళవారం మండల వనరుల కేంద్రంలో ఆయనను ఎంఆర్‌సీ సిబ్బంది, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు.

రామకృష్ణకు..

సింగరేణి(కొత్తగూడెం): ఇటీవల మహానంది కోల్‌ఫీల్డ్‌లో జరిగిన ఓవర్ ఆల్ ఛాంపియన్ షిప్ సాధించినఎం.రామకృష్ణ, పబ్లిక్ సెక్టార్‌కు ఎంపికైన పి.పవన్, మాన్వితలను మంగళవారం ఐఎన్‌టీయూసీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, నాగమోహన్, భీముడు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పాల్వంచ: విద్యుత్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చారుగుండ్ల రమేష్ కోరారు. మంగళవారం కేటీపీఎస్ గెస్ట్ హౌజ్‌లో జెన్‌కో డైరెక్టర్(సివిల్,హెచ్‌ఆర్) ఎ.అజయ్‌ని కలిసి వినతిపత్రం అందించారు. మాట్లాడుతూ.. ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌గా మార్చి పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ఆర్టిజన్ గ్రేడ్‌లను మార్పు చేయాలని, అన్ని జనరేటింగ్ స్టేషన్‌లకు నూతన పోస్ట్‌లకు మంజూరు చేయాలని విన్నవించారు.

పూల పండుగకు పూలు కరువు!

- గునుగు పూల జాడలేదు.. అక్కడక్కడే తంగేడు పూలు
- కోతుల బెడదతో ఇళ్లలో కనిపించని పూలమొక్కలు
- బతుకమ్మలకు టేకు, కాగితపు పూలే దిక్కు


తోటలో విక్రయానికి సిద్ధంగా ఉన్న బంతిపూలు

ఇల్లెందురూరల్: తెలంగాణ సంస్కృతికి సామాజిక జీవనానికి అద్దం పట్టే వేడుక బతుకమ్మ. సాధారణంగా దేవుళ్లను పూలతో పూజిస్తే.. పువ్వులనే దేవతలుగా భావించి పూజించే అరుదైన సంస్కృతి తెలంగాణలో బతుకమ్మగా విరాజిల్లుతోంది. అంటే ప్రకృతిని ఆరాధించే పండుగ బతుకమ్మ. ప్రకృతిలోని పూలను సేకరించి తెచ్చి.. బతుకమ్మగా పేర్చి.. వాటిపై గౌరమ్మను పెట్టి.. ఆటపాటలతో పూజించే పండుగ. కానీ నేడు బతుకమ్మను పేర్చేందుకు సంప్రదయ పూల జాడ లేదు. బతుకమ్మను టేకు, కాగితపు పూలతో అలంకరించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

బతుకమ్మలో తీరొక్క పూలు..

బతుకమ్మను తీరొక్క పూలతో అలంకరిస్తారు. అందులో ప్రధాన మైనవి తండేగు, గునుగు, బంతి, కట్లపూలు, రుద్రాక్ష, సీతజడ, బీరపువ్వు, పాండవుల పుష్పాలు, గుమ్మడి, మందారంలతోపాటు ఇంటి పెరడులో పూసే పలు రకాలైన పూలతో బతుకమ్మను అందంగా ముస్తాబు చేస్తారు.

ఆ పూలలో ఔషధగుణాలు..

బతుకమ్మను పేర్చేందుకు చాలారకాల పూలను వినియోగిస్తారు. సహజ సిద్ధంగా అడవులలో పూసే పూలను అధికంగా వినియోగిస్తారు. ఇలా ఉపయోగించే పూలలో ఔషధ గుణాలు చాలా ఉన్నాయి. పాత రోజుల్లో వర్షాకాలంలో కొత్తనీరు చేరువుల్లోకి చేరేది. ఆ నీటినే ప్రజలు నేరుగా తాగేవారు. నీరు కలుషితం కాకుండా ఉండేందుకు గాను ఔషధ గుణాలు కలిగిన పూలను అందులో వేసేవారు. అలా బతుకమ్మ పండుగకు కూడా పలురకాల పూలను వినియోగించేవారు. ఆ విధంగా బతుకమ్మ పండుగ ప్రజలను కాపాడే పండుగైంది. బతుకమ్మలను నీటిలో వేయడం వల్ల పువ్వులు, కాడలు నీటిలో కలిసి పోతాయి. తద్వారా వాటిలోని ఔషధ గుణాల ప్రభావంతో నీటిలోని బాక్టీరియా చనిపోతుంది. నీరు కూడా సహజంగా శుద్ధి అవుతుందని నాటితరం పెద్దలు చెపుతున్నారు.

తెల్లవారక ముందే పూలసేకరణ..

బతకమ్మ పండుగ వచ్చిందంటే చాలు.. మహిళలు, యువతులకు ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా... పూలను ఎక్కడెక్కడ సేకరించాలా.. అని నిద్ర కూడా సరిగాపోయేవారు కాదు. తెల్లవారక ముందే అక్కాచెల్లెళ్లు బుట్టలను చేతపట్టుకొని వీధుల్లో పలు రకాల పూలను సేకరించేవారు. రహస్యంగా పూలను తస్కరించి సరదా పనులుగా భావించి ఆనందపడేవారు. సోదరులు ఒకరోజు ముందే అడవికి వెళ్లి సహజసిద్ధంగా లభించే తంగేడు, గునుగు పూలను బస్తాలలో సేకరించి తెచ్చేవారు.

కనిపించని సంప్రదాయ పూలు..

తెలంగాణ మహిళలు ఘనంగా నిర్వహించుకునే పూల పండుగ బతుకమ్మ. కానీ నేడు బతుకమ్మ వేడుకకు పూలే కరవయ్యాయి. గతంలో ఏ అటవీ ప్రాంతానికి వెళ్లినా బతుకమ్మకు కావాల్సినన్ని తంగేడుపూలు కనిపించేవి. గుంపులు గుంపులుగా చెట్లు.. వాటి నిండా పూలు ఉండేవి. నేడు వాటి జాడ లేదు. వ్యవసాయ భూముల్లో రసాయన పదార్థాలు, ఎరువుల వాడకం పెరగడంతో గునుగు పూల చెట్లు కనిపించకుండా పోయాయి. బతుకమ్మను పేర్చడంలో ప్రధానంగా అడుగు భాగాన తంగేడు పువ్వు, పైన గునుగు పూలనే ఉంచుతారు. పువ్వులు ఆశించిన మేర లభించకపోవడంతో బతుకమ్మ ఎత్తునూ తగ్గించారు. తంగేడు, గునుగు పూలు దొరకకపోవడంతో టేకుపూలు, కాగితపు పూలనే బతుకమ్మ పేర్చేందుకు వినియోగిస్తున్నారు. దీనికి అనేక కారణాలు ఉన్నా.. ప్రధానంగా అభివృద్ధి పేరిట చెట్లను నరుకుతూ.. అడవులను అంతరింపచేస్తుండటంతో క్రమంగా అడవులలోనూ సంప్రదాయ పూల జాడ లేకుండా పోతోంది.

ఇళ్లలో కోతుల బెడదతో..

పువ్వులను అమితంగా ఇష్టపడే మహిళలు తొలకరి సమయంలోనే పలు రకాలైన పూల మొక్కల విత్తనాలు విత్తుకునేవారు. కానీ నేడు వనాలను వీడిన వానరాలు గ్రామాలకు చేరడంతో ప్రతీ ఇంట్లోనూ పెరడు బోసిపోతోంది. కోతులు మొక్కలను పీకడం, కొమ్మలను విరిచేయడం చేస్తున్నాయి. దీంతో మహిళలు ఇంటి పెరడులో పూల మొక్కలను పెంచడం మానుకున్నారు.

పూల ధరలకు రెక్కలు..

సుదూర ప్రాంతాలలో సేకరించిన తంగేడు, గునుగు, ఇతర పూలతో బతుకమ్మ పండుగ రోజున వీధులలో ప్రత్యేక పూల స్టాళ్లు వెలుస్తున్నాయి. ఇక్కడ పూల కొనేందుకు వెళ్లే వారికి వ్యాపారులు చెప్పే ధరలు దడ పుట్టించేలా ఉంటున్నాయి. బతుకమ్మ పండుగను ఇష్టపడే మహిళలు ధర ఎక్కువైనా తప్పని పరిస్థితిలో కొన్ని పూలను కొనుగోలు చేసి టేకు, కాగితపు పూలతో బతుకమ్మను అలంకరించకోక తప్పడం లేదు.

ఊరి చివరే పూలు దొరికేవి..



బతుకమ్మ పండుగను చిన్నప్పటి నుంచే ఆడడం అలవాటు. పండుగకు ఒక రోజు ముందే తంగేడు, గునుగు పూలను సేకరించేవాళ్లం. ఊరు చివరలోనే కావాల్సినన్ని పూలు దొరికేవి. నేడు ఎంత దూరం వెళ్లినా పూలు దొరకడం లేదు.

– దుర్గాబాయి, సుభాష్‌నగర్

కొనుగోలు చేయాల్సి వస్తోంది..



ఏటా తొలకరి సమయంలోనే ఇంటి పెరడులో పూల మొక్కలు నాటుకునేవాళ్లం. పండుగ సమయానికి అవి విరగపూసేవి. తంగేడు, గునుగు పూలను ఊరు చివరలోనే సేకరించేవాళ్లం. నేడు కోతుల బెడద, అడువులు అంతరించడంతో విధిలేక కొనుగోలు చేస్తున్నాం.

– కూరపాటి పార్వతి, తిలక్‌నగర్

డీఎస్సీ ఫలితాల్లో సత్తా


కోటేశ్వరరావు


తిరుపతిరావు

ఇల్లెందు/ఇల్లెందురూరల్: డీఎస్సీ ఫలితాల్లో ఇల్లెందు వాసి సత్తా చాటారు. ఇల్లెందు మండలం బాలాజీనగర్ జీపీ పరిధి సంజయ్‌నగర్‌కు చెందిన కొంపెల్లి కోటేశ్వరరావుకు సోషల్ స్టడీస్ విభాగంలో జిల్లా ప్రథమ ర్యాంకు లభించింది. ప్రస్తుతం మైనార్టీ గురుకులంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన గతంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గానూ ఉద్యోగం సాధించగా ప్రస్తుతం ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. అలాగే, మండలంలోని బాలాజీనగర్ జీపీ కార్యదర్శి తిరుపతిరావు విధులు నిర్వర్తిస్తూ డీఎస్సీలో ఎస్‌జీటీగా ఎంపికయ్యాడు. సుదీర్ఘ కాలం వేచి ఉన్నప్పటికీ తాను ఆశించిన ఉపాధ్యాయ ఉద్యోగం లభించడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు.


సాయిరామ్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

జూలూరుపాడు: డీఎస్సీ ఫలితాల్లో జూలూరుపాడు మండలం పాపకొల్లు గ్రామ పంచాయతీ ముత్యాలమ్మ కాలనీకి చెందిన భూక్యా సాయిరామ్ జిల్లా స్థాయిలో హిందీ పండిట్‌లో రెండో ర్యాంకు సాధించాడు. ఈ మేరకు తల్లిదండ్రులు, బంధువులు సాయిరాంకు అభినందనలు తెలిపారు.

సమాజంలో విద్యార్థుల పాత్ర కీలకం

ఇల్లెందు: సమాజ పురోభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకమని సీపీఐ జిల్లా నాయకుడు డాక్టర్ సుధాకర్, మాజీ ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకుడు దేవరకొండ శంకర్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు హరీష్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఇల్లెందులో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా వన్ డే వర్క్ షాప్‌లో మాట్లాడారు. ఉన్నత చదువులు చదువుకుని దేశంలో మంచి పౌరులుగా సామాజిక బాధ్యతతో నిలవాలని సూచించారు. అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు రాజకీయంగా చైతన్యవంతమైనప్పుడే మంచి రాజకీయాలు మనుగడలో ఉంటాయని తెలిపారు. ప్రజల కోసం పని చేసే పార్టీని నేతలను ఎన్నుకునే అవకాశం ఉందన్నారు. బ్రిటీష్ వారు ప్రవేశపెట్టిన మెకాలే విద్యావిధానాన్ని అవలంబిస్తూ బానిస విద్యను అభ్యసిస్తున్నామని తెలిపారు. శాస్త్రీయ విద్య ద్వారా దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. మనస్, ఉదుత ఐలయ్య, సాయి, గణేష్, సాయి పాల్గొన్నారు.

విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు


ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థులు

సింగరేణి(కొత్తగూడెం): వ్యర్థాల నుంచి కళాకృతులు రూపొందించడంతో మంగళవారం జిల్లాస్థాయి పోటీలు నిర్వహించగా రామవరం పాఠశాల విద్యార్థులు అభినందనలు అందుకున్నారు. పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థి కె.సాయిహరిత చినిగిపోయిన చీరల నుండి ఫ్లోర్ మ్యాట్, పాత ఆయిల్ టిన్నును డస్ట్‌బిన్‌గా మార్చిన పాషి అజయ్‌ను కలెక్టర్ పాటిల్ అభినందించారని పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ ప్రభుదయాళ్ తెలిపారు.

టేకులపల్లి: జిల్లా స్థాయిలో ఎకో బ్రిక్స్ తయారు చేసి విజేతగా నిలిచిన టేకులపల్లి పంచాయతీ కార్యదర్శి వి.దీప్తి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ నుంచి మంగళవారం ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

ఇల్లెందురూరల్: పోలారం గ్రామపంచాయతీ కార్యదర్శి రణధీర్‌రెడ్డిని మంగళవారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ప్రశంసాపత్రంతో సన్మానించారు. పంచాయతీలో ఎకోబ్రిక్స్ అత్యధిక సంఖ్యలో తయారు చేసి పర్యావరణ హితం కోసం పాటుపడినందుకు గాను కార్యదర్శి రణధీర్‌రెడ్డికి ఈ గౌరవం దక్కింది.

బతుకమ్మ, ఫ్యామిలీ డే వేడుకలపై సమీక్ష


మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు, ఫ్యామిలీ డే వేడుకల నిర్వహణపై సేవా కోఆర్డినేటర్లతో మంగళవారం వెల్ఫేర్ విభాగంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీఎం రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. బుధవారం నుంచి బతుకమ్మ పండుగ వేడుకలు జరగనున్న నేపథ్యంలో సింగరేణి కార్పొరేట్ కార్యాలయంలో ప్రకాశం స్టేడియంలో, అదేవిధంగా ఫ్యామిలీ డే వేడుకలు ఘనంగా నిర్వహించాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు. ఈ వేడుకల్లో మహిళా ఉద్యోగినులు పాల్గొనేలా చూడాలని ఆయా శాఖ హెచ్‌ఓడీలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనికేషన్ ఆఫీసర్ టి.శ్రీనివాస్‌రావు, డీవై మేనేజర్ (ఐటీ) కిరణ్మయి, వెల్ఫేర్ పీఏ కే.వరప్రసాద్, సేవా సెక్రటరీలు కే.సుజాత, కోఆర్డినేటర్ ఇజాజ్, షరీఫ్, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

సింగరేణి హైస్కూల్ గ్రౌండ్ పరిశీలన

ఇల్లెందు: జేకే కాలనీలోని సింగరేణి హైస్కూల్ మైదానాన్ని ఏరియా జీఎం జాన్‌ఆనంద్ మంగళవారం పరిశీలించారు. స్టేజీ, సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించనున్న బతుకమ్మ వేడుకల ప్రదేశాన్ని, బతుమ్మల నిమజ్జన కొలనును పరిశీలించారు. లైటింగ్, కంపెనీ లెవల్ బాస్కెట్ బాల్ క్రీడాపోటీల ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు తగిన సలహాలు, సూచనలు చేశారు. డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, డీజీఎం సివిల్ రవికుమార్, ఏరియా వర్క్‌షాప్ ఇంజనీర్ నాగరాజు నాయక్, పవన్‌కుమార్, సివిల్ ఇంజనీర్ వెంకటేశం, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సాయి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందులో 123 శాతం బొగ్గు ఉత్పత్తి

ఇల్లెందు: బొగ్గు ఉత్పత్తిలో ఇల్లెందు ఏరియా అగ్రస్థానంలో ఉందని ఏరియా జీఎం జాన్‌ఆనంద్ వెల్లడించారు. మంగళవారం ఇల్లెందులోని తన చాంబర్‌లో విలేకరుల మాట్లాడారు. సెప్టెంబర్‌కు నిర్దేశించిన లక్ష్యం 2.58 లక్షల టన్నులకు గానూ 3.18 లక్షల టన్నులు బొగ్గు ఉత్పత్తిని చేసి 123 శాతం లక్ష్యం సాధించినట్లు తెలిపారు. 0.51 లక్షల టన్నులు బొగ్గు రైలు మార్గం ద్వారా, 0.59 లక్షల టన్నులు రోడ్డు మార్గం ద్వారా, ఆర్‌సీహెచ్‌పీ ద్వారా 2.03 లక్షల టన్నులు 13 ర్యాకుల ద్వారా బొగ్గు రవాణా చేశామని వివరించారు.

కొత్తగూడెం ఏరియాలో 87శాతం..

సింగరేణి (కొత్తగూడెం): సెప్టెంబర్‌లో కొత్తగూడెం ఏరియా కంపెనీ నిర్దేశించిన 9.96 లక్షల టన్నుల లక్ష్యానికి 8.70 లక్షల టన్నులతో 87 శాతం ఉత్పత్తి సాధించింది.

ఆలిండియా యూనివర్సిటీ స్థాయి పోటీలకు ఎంపిక

కొత్తగూడెంఅర్బన్: చదరంగంలో ఆల్ ఇండియా యూనివర్సిటీ స్థాయి పోటీలకు ప్రియదర్శిని కాలేజీ విద్యార్థి ఎంపిక అయ్యాడు. సెప్టెంబర్ 29, 30న వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో జరిగిన చదరంగం పోటీలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న గణేష్ యూనివర్సిటీలో ప్రథమ స్థానంలో నిలిచి ఆలిండియా పోటీలకు ఎంపికై నట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో కళాశాల యాజమాన్యం గణేష్‌ను అభినందించారు.

ప్రజలకు ఉపయోగపడే పనులు ఎంపిక చేయండి..

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీల పరిధిలో అవసరమైన అభివృద్ధి పనుల ఎంపికలో ప్రజాహితం కనిపించాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం గ్రామసభ నిర్వహించి పంచాయతీ పరిధిలో చేపట్టాల్సిన పనులను ఎంపిక చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ చిరంజీవి, ఏపీవో శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి లక్ష్యాలను చేరుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సింగరేణి ఈఅండ్‌ఎం అడిషనల్ జనరల్ మేనేజర్ రాజీవ్‌కుమార్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం ఏ పవర్ హౌస్‌బస్తీలోని ఎస్సీ హాస్టల్‌లో తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి హాజరై మాట్లాడారు. తాను అనేక కష్టాలు పడి చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించామని పేర్కొన్నారు. ఉన్నత లక్ష్యంతో చదువుకొని సింగరేణిలో అంచలంచలుగా అడిషనల్ జనరల్ మేనేజర్ స్థాయికి ఎదిగినట్లు చెప్పారు. ప్రస్తుతం ఉన్నత చదువులు చదువుకోవడానికి అనేక సౌకర్యాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని అవకాశాలని ఉపయోగించుకొని విద్యార్థినులు ప్రత్యేకంగా నేటి పరిస్థితులకు అనుగుణంగా కష్టపడి చదువుకోవాలని సూచించారు.

మహిళా చట్టాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఆనంద్

జూలూరుపాడు: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం హ్యూమన్ రైట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ సొసైటీ వ్యవస్థాపకుడు ఆదూరి ఆనంద్ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, వినియోగదారుల హక్కుల చట్టం, ఆన్‌లైన్ మోసాలు, కార్యాలయాల్లో వేధింపులు వంటి అంశాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలన్నారు.

అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాలల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, హైస్కూల్ హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, హ్యూమన్ రైట్స్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు మోదుగు వినోద్‌కుమార్, బహుజన అభ్యుదయ సేవా సమితి అధ్యక్షురాలు ఆదూరి మణి, బి.ప్రేమకుమారి, బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు వితరణ

ఇల్లెందురూరల్: కొమరారం కాంప్లెక్స్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు చేతన ఫౌండేషన్ చేయూతనందించింది. మంగళవారం కొమరారం హైస్కూల్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు పాఠశాలల వారీగా టీవీలు, బ్యాగ్‌లు, నోట్ బుక్స్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు వెనిగళ్ల వెంకటేశ్వరరావు, దొడ్డపనేని సీతారామయ్య, నవీన్, సత్తులాల్, హ్యూమన్ రైట్స్ కమిషన్ జిల్లా అధ్యక్షుడు అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ క్రాప్ సర్వేను విరమించుకోవాలి


జూలూరుపాడు: నిరసన తెలుపుతున్న ఏఓ, ఏఈఓలు

సుజాతనగర్: కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన డిజిటల్ క్రాప్ సర్వేను నిరసిస్తూ మండల ఏఈఓలు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్లస్టర్‌లోని ఒక ఏఈఓ 5 నుంచి 8 గ్రామాలు, 6 వేల నుంచి 10 వేల ఎకరాలు చూడటం కష్టంగా ఉంటుందన్నారు. ఈడీసీఎస్ సర్వే కొరకు గ్రామస్థాయిలో సహాయకులను నియమించాలని రాష్ట్ర వ్యవసాయ సంచాలకులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నత స్థాయి అధికారులు డీఎస్ సర్వే కొరకు ఏఈఓలపై ఒత్తిడి తీసుకరావడం తగదన్నారు. ఏఈఓలు నరసింహారావు, శరత్, ప్రనూష పాల్గొన్నారు.

జూలూరుపాడు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన డిజిటల్ క్రాప్ సర్వే ఏఈఓలు చేయాలని ఒత్తిడి చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం జూలూరుపాడులో ఏఓ, ఏఈఓలు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఏఓ దీపక్ ఆనంద్, ఏఈఓలు గోపీకృష్ణ, లావణ్య, గౌస్, భాను, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే వ్యాధులు దూరం

టేకులపల్లి: సీజనల్ వ్యాధుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సులానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి కందుల దినేష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలకు, వైద్య సిబ్బందికి కీటక జనిత వ్యాధులు, అంటువ్యాధులు, క్షయ, కుష్టు వ్యాధుల నివారణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు సోకే వ్యాధులలో కీటకాల ద్వారా ఒకరి నుంచి ఒకరికి వచ్చే వ్యాధుల శాతమే అధికంగా ఉంటుందని, క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పరిశుభ్రత లేని హోటళ్లు, వీధులలోని ఆహార పదార్థాలను, నీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకోరాదని, పండ్లు, కూరగాయలు 15 నిమిషాలు ఉప్పు నీటిలో నానబెట్టిన తర్వాత శుభ్రంగా కడిగిన తర్వాతనే ఉపయోగించుకునే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ గన్యా, పబ్లిక్ హెల్త్ నర్స్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఘనంగా బతుకమ్మ సంబురాలు


సింగరేణి(కొత్తగూడెం): రామవరం పాఠశాలలో

కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం ముందస్తు బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు సంప్రదాయ వస్త్రాలతో బతుకమ్మలు తెచ్చి గౌరమ్మను పూజించి, ఉపాధ్యాయునులతో కలిసి ఆడిపాడారు. అనంతరం సమీపంలోని చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


కొత్తగూడెంఅర్బన్: శ్రీరాగా స్కూల్‌లో...



సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా కళాశాలలో.. , పాల్వంచ: స్టార్ చిల్డ్రన్ స్కూల్‌లో..


కొత్తగూడెంరూరల్: త్రివేణి స్కూల్‌లో...


సుజాతనగర్: శ్రీవాణి నికేతన్ పాఠశాలలో...


జూలూరుపాడు ప్రభుత్వ పాఠశాలలో...


ఇల్లెందురూరల్: డిగ్రీ కళాశాలలో..